క్లుప్తంగా

శివాలయం నిర్మాణానికి భూమి పూజ



జలదంకి: మండలంలోని సోమవరప్పాడులో శివాలయం నిర్మాణానికి ప్రముఖ కాంట్రాక్టర్ చేవూరు జనార్దన్‌రెడ్డి, సతీమణి, గ్రామ సర్పంచ్ చేవూరు సులోచనమ్మ దంపతులు సోమ వారం భూమి పూజ చేశారు. తమ సొంత నిధులతో సాయిబాబా మందిరంతో పాటు శివాలయాన్ని నిర్మిస్తున్న సర్పంచ్ దంపతులను సోమవరప్పాడుతో పాటు కొత్తపాళెం, కృష్ణాపాడు, వేములపాడు పంచాయతీల ప్రజలు అభినందించారు.

సీసీరోడ్లు నిర్మించాలని వినతి



జలదంకి: మండల కేంద్రమైన జలదంకి పంచాయతీ పరిధిలోని అప్పారావుతోట గిరిజన కాలనీలో సీసీరోడ్లు నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. 1968లో కాలనీ ఏర్పాటైనా ఇప్పటి వరకు సీసీరోడ్ల నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. వర్షాలకు అంతర్గత రోడ్లు బురదమయంగా మారడంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. సీపీఎం మండల కార్యదర్శి రావి మాల్యాద్రి, నాయకులు ఆంతోనీబాబు, నరసింహం, గడ్డం మాల్యాద్రిరెడ్డి పాల్గొన్నారు.

రేకులు పగుల గొట్టి.. చోరీకి యత్నించి

చేజర్ల: ఆదూరుపల్లిలోని నిర్మల మందుల షాపులో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. షాపు పైకప్పు రేకులను పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు నగదు ఏమీ దొరకకపోవడంతో వెనుతిరిగారు. సోమవారం ఉదయం షాపు తెరిచిన యజమాని రాజు రేకులు పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. ఎలాంటి నష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



ఉదయగిరి/సీతారామపురం: ఉదయగిరి మండలం కృష్ణంపల్లి మెయిన్, సీతారామపురం మండలం నారాయణపేట ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓలు తోట శ్రీనివాసరావు, మస్తాన్‌వలి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన మృతుల కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి సోమవారం రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 7వ వార్డుకు చెందిన షేక్ మెహతాజ్, 12వ వార్డుకు చెందిన ఓ ఆనంద్‌బాబు, 16వ వార్డుకు చెందిన చిలకపాటి చంద్రశేఖర్, 19వ వార్డుకు చెందిన దాట్ల పెంచలమ్మ, ఎస్ జగదీష్, 22వ వార్డుకు చెందిన సోమా పెంచల నరసింహులు ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు చెక్కులను అందజేశారు. ట్రస్ట్ సభ్యుడు పసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు

ఆత్మకూరు: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ బీడీ, మైకా కార్మికుల పిల్లల నుంచి ఉపకారవేతనాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆత్మకూరు బీడీ కార్మిక సంక్షేమ వైద్యశాల డాక్టర్ పీ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలల్లో ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ విద్యార్థులు ఈ నెల 30లోగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040–29561297 నంబరులో లేదా కార్మిక ఆస్పత్రిలో సంప్రదించాలని కోరారు.

ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు

కొండాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో ప్రహరీ కూల్చివేతపై మర్రిగుంటకు చెందిన దార్ల నారమ్మ సోమవారం డయల్‌కు 100 కు కాల్ చేసింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తమ పెద్దలు ఇచ్చిన స్థలంలో కొన్ని నెలల క్రితం ప్రహరీను నిర్మించుకోగా కీర్తి, ఆమె కుమార్తె నందిని కూల్చివేశారని నారమ్మ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరింది.

ముందస్తు జాగ్రత్తలతో లాభాల పంట

పండ్లలో ఫలరాజు మామిడి. వేసవిలో వచ్చే ఈ పండ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. నాణ్యమైన, అధిక దిగుబడులు రైతులకు లాభాలు తెచ్చిపెడుతాయి. అందుకు పూత, పిందె దశలు కీలకం. ఈ దశల్లో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాల పంటను పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.



కావలి మండలం ఆర్పీపాళెంలో సాగుచేస్తున్న మామిడి తోట

కావలి: కావలి నియోజకవర్గంలో 3,500 ఎకరాల్లో మామిడి సాగుచేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, పునరస, తోతాపురి, తదితర రకాలను పండిస్తున్నారు. సాధారణంగా మామిడి తోటలు డిసెంబర్‌లో పూతకు వస్తాయి. జనవరిలో పిందెలు పడుతాయి. ఈ కాలం మామిడి దిగుబడులకు కీలకం. ఈ దశల్లో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. గత కొంతకాలంగా మామిడిపై ప్రకృతి పగబట్టిన పరిస్థితులు ఉన్నందున ఈ నెలలో భారీగా కురిసిన వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే డిసెంబరులో వచ్చే పూత జనవరికి వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. మామిడి తోటల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రధానంగా చెట్ల మొదళ్లలో వర్షపు నీరు ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదు. డిసెంబర్‌లో మొదలయ్యే చలి, సంక్రాంతికి చుట్టుముట్టే పొగ మంచు మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. వాతావరణంలోని మార్పుల వల్ల పలు రకాల తెగుళ్లు సోకే అవకాశం ఉంటుంది. పూత, పిందె దశల్లో మామిడి రైతులు సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది. మామిడి పూత బాగా రావడానికి పిందెలు బాగా నిలవడానికి, కాయ నాణ్యత మెరుగుపడడానికి జింక్, బోరాన్, మాంగనీస్, ఐరన్ వంటి సూక్ష్మపోషకాల అవసరం ఎంతో ఉంటుంది. అవసరాన్ని బట్టి ఆయా సూక్ష్మ పోషకాల మిశ్రమాలను పిచికారీ చేయాలి. జింక్ లోపించిన మొక్కల్లో ఆకులు చిన్నగా మారి రెమ్మల ఎదుగుదల మందగిస్తుంది. ఫలితంగా మొక్కలు బలహీనపడతాయి. దీంతో పూత బాగా రాదు. ఇక బోరాన్ మామిడి పూత, పిందె రావడానికి సాయపడుతుంది. పూత గుత్తుల్లో పిందె కట్టే ద్విలింగ పుష్పాలు అధికంగా రావడానికి దోహదపడుతుంది. పూర్తిస్థాయిలో ఫలదీకరణ జరిగి పిందెలు అధికంగా ఏర్పడటానికి ఉపయోగపడుతుంది. బోరాన్ లోపించిన చెట్లలో పిందె రాలడం ఎక్కువగా కనిపిస్తుంది. కాయలపై బుడిపెలు రావడం, బంక కారడం, పగుళ్లు ఏర్పడడం, తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఫలితంగా కాయల నాణ్యత దెబ్బతింటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కావలి నియోజకవర్గంలో లేత, ముదురు మామిడితోటలు ఉన్నాయి. వర్షాలు కురుస్తున్నందున మామిడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తోటలో నిలబడిన నీటిని వెంటనే తొలగించాలి. బోర్డియాక్ మిశ్రమాన్ని చెట్టు మొదళ్లకు కింది నుంచి రెండు అడుగుల ఎత్తు వరకు పూయాలి. తెగుళ్లు, పురుగుల ఉద్ధృతి నివారణకు 3 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్, కార్బన్‌డిజం 2 గ్రాముల మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం కొమ్మల పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. ఉడుకు రావడానికి సల్ఫర్‌ను పిచికారీ చేయాలి. నాణ్యమైన పూత సమయానికి రావడానికి లీటర్ నీటికి 3 నుంచి 5 గ్రాముల ఫార్ములా, 4 నుంచి 10 గ్రాముల మల్టీ కే కలిపి పిచికారీ చేయాలి.

– ఎం సుధామయి,ఉద్యాన శాఖ అధికారిణి, కావలి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మర్రిపాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ మష్కూర్‌అహ్మద్ సూచించారు. మండలంలోని వెంకటాపురం ఎస్సీ కాలనీలో జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరపీడితులు, లార్వా సర్వే నిర్వహించారు. జ్వర పీడితులకు రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఉదయగిరి మలేరియా సబ్‌యూనిట్ అధికారి షేక్ నౌషాద్‌బాబు, ఆరోగ్య విస్తరణాధికారి షేక్ జావీద్, ఎంఎల్‌హెచ్‌పీ భూలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు రమణయ్య, ఖాజాముబారక్, ఏఎన్ఎం రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

భూమిని టీడీపీ నాయకుడు ఆక్రమించాడని ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

దుత్తలూరు: తన భూమిని టీడీపీ నాయకుడు ఆక్రమించి సాగు చేసుకుంటున్నాడని భైరవరం గ్రామానికి చెందిన చినపెంచలయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్ నాగరాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. తన తండ్రి తాళ్లూరి నరసయ్యకు సర్వే నంబరు 69-2లో 5.03 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆయన చనిపోయిన తరువాత సదరు భూమిని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆక్రమించి సాగుచేసుకుంటున్నాడని, అదేమని ప్రశ్నిస్తే నీకు ఎంత డబ్బు కావాలో చెప్పు..ఇస్తాను..భూమిని వదిలేయాలంటున్నాడని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ గురువారం గ్రామానికి వచ్చి భూమిని పరిశీలిస్తానని, భూమికి సంబంధించిన సరైన పత్రాలు చూపించాలన్నారు. వారి వెంట సీపీఎం నాయకుడు గుజ్జుల మల్లికార్జున ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి

అల్లూరు: ఎస్సీ, ఎస్టీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐడీ డీఎస్పీ ఎన్ కోటారెడ్డి, కావలి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. సీఐడీ ఆధ్వర్యంలో అల్లూరులోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం చట్టాలపై విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించి బహుమతులను అందజేశారు. సీఐ పాపారావు, ఎస్సై కిషోర్ బాబు, ఎంపీడీఓ రజనికాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు దాసరి పోలయ్య, ఎల్లు సాల్మాన్‌రాజు, సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



లక్కీడిప్ విజేతలతో ఆర్టీసీ అధికారులు

కావలి: కావలి డిపోలో సోమవారం లక్కీడిప్ నిర్వహించారు. కొండాపురం, లింగసముద్రం, అల్లూరు మార్గాలకు సంబంధించి విజేతలుగా నిలిచిన ప్రయాణికులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎం రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ కొండాపురం, లింగసముద్రం, అల్లూరు మార్గాల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియోను పెంచేందుకు ప్రతినెలా లక్కీడిపో నిర్వహించి డాక్టర్ రామస్వామి ఆస్పత్రి సౌజన్యంతో బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా అక్టోబరు నెలకు సంబంధించి లింగసముద్రం మార్గంలో ఏసుబాబు, కొండాపురం మార్గంలో కే ప్రతాప్, అల్లూరు మార్గంలో ఎస్ కృష్ణకుమారి విజేతలుగా నిలవగా బహుమతులు అందజేసినట్లు వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ ఎం కల్పన, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, బస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎం రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడుల పరిశీలన



అల్లూరు: మండలంలోని వరి నారుమడులను కావలి ఏడీఏ నాగరాజు సోవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. నారు నాటుటకు ఐదు రోజుల ముందు ఎకరాకు సరిపడా నారు మడిలో 800 గ్రాముల కార్బోఫ్యూరాన్–3జీ గుళికలు వేసుకుంటే నెలరోజుల పాటు తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. నారు తలలు తుంచి నాటడం వల్ల కాండం తొలిచే పురుగు గుడ్లను నివారించవచ్చని వివరించారు. వరి పంటకు యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ ఆర్ వెంకటేశ్వర్లు, వీఏఏ ప్రసాద్ ఉన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

సీతారామపురం: మండలంలోని సింగారెడ్డిపల్లిలోని సర్వే నంబర్లు 125,129, 110, సీతారామపురంలోని సర్వే నంబర్లు 263, 481లో ఉన్న వివాదాస్పద భూములను త్రిసభ్య కమిటీ బృందం సోమవారం పరిశీలించింది. 2023లో ఎండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆయా సర్వేనంబర్లలోని భూముల్లో మైనింగ్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంది. అప్పట్లో డీఆర్వో వెంకటనారాయణమ్మ గ్రామసభ నిర్వహించగా పశువుల మేతపొరంబోకు భూముల్లో మైనింగ్ అనుమతులు ఇవ్వొద్దని స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆత్మకూరు ఆర్డీఓ పావని ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో త్రిసభ్య కమిటీ బృందం భూములను పరిశీలించింది. తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, వీఆర్వో గాజులపల్లి వంశీ, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ



మర్రిపాడు: మండలంలోని చుంచులూరు సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఉపాధి సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

కొండాపురం: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడిన ఏడుగురు ఉపాధి సిబ్బందిపై జిల్లా అధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లుగా ఎంపీడీఓ ఆదినారాయణ సోమవారం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.15.60 కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. అందుకు సంబంధించి సెప్టెంబర్ 13న నిర్వహించిన ప్రజావేదికలో రూ.98.26లక్షల మేర ఉపాధి సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు గుర్తించి నగదు రికవరీ చేశారు. ప్రజావేదికలో గుర్తించిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టిన జిల్లా అధికారులు సుమారు రెండు నెలల తరువాత ఏపీ వీ చెంచయ్య, ఈసీ జీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు డీ జవహర్‌లాల్, కే కోటేశ్వరరావు, ఏ వెంకట్రావ్, గరిమెనపెంట, సత్యవోలు ఫీల్డ్ అసిస్టెంట్లు డీ శ్రీనివాసులు, జే రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సోమశిల: అనంతసాగరం మండలం కాకూరువారిపల్లికి చెందిన టీ పిచ్చిరెడ్డి కాకూరువారిపల్లి-కొత్తపల్లి రోడ్డు పక్కన సోమవారం ఉదయం గాయాలతో పడి ఉండడాన్ని అటుగా వెళ్తున్న వారు గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందజేయగా ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పిచ్చిరెడ్డి గాయపడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

బీజేపీ సమావేశం



దుత్తలూరు: మండలంలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో నర్రవాడలో బీజేపీ సభ్యత్వ నమోదుపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అధిక సంఖ్యలో సభ్యత్వాలను చేపట్టాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు చుండి హరిగోపాల్‌రెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

దుత్తలూరు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దుత్తలూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను సోమవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ సునీల్‌కుమార్ పర్యవేక్షించారు.

ఓవరాల్ చాంపియన్‌గా సంగం గురుకులం



సంగం: మూడో జోనల్ స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో సంగంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు ప్రిన్సిపల్ సుమతి తెలిపారు. సోమవారం గురుకులంలో క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారిణులతో పాటు పీఈటీలు నజీమా, లక్ష్మీప్రసన్నను ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపల్ అభినందించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తి మార్గంలో పయనించాలి



లగడపాటి రామలక్ష్మమ్మతో మాట్లాడుతున్న జీయర్‌స్వామి

సంగం: ప్రతిఒక్కరూ సనాతన మార్గాన్ని పాటిస్తూ భక్తిని చాటుకుని మోక్షాన్ని పొందాలని శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేశారు. మండలంలోని అమరపునాయుడుకండ్రికలోని ల్యాంకో వృద్ధాశ్రమాన్ని సోమవారం రాత్రి జీయర్‌స్వామి సందర్శించారు. ఆశ్రమంలోని ఆంజనేయస్వామి, శ్రీకృష్ణుడి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. కార్తీక మాసం అత్యంత ప్రీతికరమైందని, ప్రతిఒక్కరూ ఉపవాసదీక్షతో కార్తీక దీపాలు వెలిగించాలన్నారు. వృద్ధాశ్రమం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, ఇటువంటి చోట ఆరోగ్యం దొరుకుతుందన్నారు. అనంతరం ఆశ్రమం గురించి లగడపాటి రామలక్ష్మమ్మను అడిగి తెలుసుకుని స్వగ్రామంలో వృద్ధాశ్రమం నిర్మించి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. తొలుత జీయర్‌స్వామికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్‌కే జిలానీ సోమవారం తెలిపారు. పట్టణంలోని జేఆర్‌పేటలో బెల్టు దుకాణంపై దాడి చేసి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాగులపాడురోడ్డులో ఓ వ్యక్తి అక్రమంగా విక్రయిస్తుండగా 40 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మర్రిపాడు: మండలంలోని సింగనపల్లిలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై శ్రీనివాసరావు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాయిల శ్రీనివాసులు వద్ద 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మండలంలో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరామర్శ



కావలి: కావలి నియోజకవర్గ బలిజ సంఘ అధ్యక్షుడు తోట వెంకటశేషయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి శేషయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

సంక్షేమ హాస్టళ్లను కాపాడాలని విజ్ఞప్తి

కావలి: సంక్షేమ వసతిగృహాలను కాపాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ వంశీకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లను మూడో వంతు ఎత్తేయడంతో బడుగువర్గాల పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహాలు శిథిలావస్థలో ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. దళిత సంఘర్షణ సమితి సభ్యులు చెరుకూరి జనార్దన్, రత్నాకర్, ఏసుపోగు విజయకుమార్, జరుగుమల్లి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై ఫిర్యాదు

చేజర్ల: మడపల్లిలోని వివాదాస్పద జామాయిల్‌తోట విషయంలో కొందరు పోలీసులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అజయ్‌ఘోష్ సోమవారం చేజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల వివాదాస్పమైన జామాయిల్ తోటలోని కర్రను కొట్టి తరలిస్తున్న కొందరికి సంగం సీఐ మద్దతుగా నిలిచారని, తనతో పాటు కొందరు టీడీపీ నాయకులను అరెస్ట్ చేసి కర్రను తరలించేందుకు సహకరించారని ఆరోపించారు. సోమవారం తాను తోటలో కూలీలతో పనులు చేయిస్తుండగా మరోసారి సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి వారిని సంగం స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న సీఐ, పోలీసులపై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

సోమశిల: లింగంగుంట గ్రామంలోని వెంకయ్యస్వామి మందిరంలో అయ్యప్ప పడిపూజోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా అయ్యప్ప మాలధారులు పాల్గొని భజనలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

మొక్కలు నాటించండి

కలిగిరి: కలిగిరి పెద్దచెరువు కట్టపై నీడ, ఫలాలను ఇచ్చే చెట్లను నాటించాలని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డికి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు సోమవారం వినతిపత్రం అందజేశాడు. కావలి నుంచి కలిగిరికి రాత్రి 7 గంటల తరువాత ఆర్టీసీ బస్సు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి 8.30 గంటలకు ఆర్టీసీ బస్సును నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయాల్లో చోరీలు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరులోని ఇంద్రాక్షి అమ్మవారి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు హుండీలోని నగదుతో పాటు అమ్మవారి రెండు బంగారు తాళిబొట్లను అపహరించుకెళ్లారు. హుండీలో సుమారు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు నగదు ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలిగిరి: అయ్యప్పరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు అమ్మవారి మెడలోని ఆరు గ్రాముల బంగారు మంగళసూత్రం, హుండీని అపహరించుకెళ్లారు. హుండీలో సుమారు రూ. 2వేలు నగదు ఉండొచ్చునని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్సై ఉమాశంకర్ ఆలయాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడు అరుంధతీయవాడలోని మాతమ్మగుడిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుడి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు అమ్మవారి మంగళసూత్రాన్ని అపహరించారు. గ్రామస్తుల సమాచారంతో చోరీ జరిగిన తీరును సోమశిల ఏఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భద్రతే ప్రధానం





చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై అతివేగం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. వాటిని అరికట్టేందుకు అధికారులు అనేక రకాల చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా జాతీయ రహదారి నిర్వహణ సంస్థ సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కనున్న బస్‌షెల్టర్లపై వినూత్నంగా ముందు భద్రత..తరువాత వేగం, అప్రమత్తంగా ఉండండి..భద్రంగా ఉండండి, తదితర స్లోగన్‌లు రాయిస్తూ వాహనచోదకులను అప్రమత్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలపై వాహనచోదకులను అప్రమత్తంగా చేసేందుకు జాతీయ రహదారి పక్కనున్న ప్రతి బస్‌షెల్టర్‌పై రోడ్డు భద్రతా నినాదాలు రాయిస్తున్నామని, వాటి వల్ల వారిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు జాతీయ రహదారి సంస్థ అధికారి నరసింహారావు తెలిపారు. –కావలి